వైభవంగా బోనాల ఉత్సవాలు



పోతరాజులతో మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 1వ డివిజన్ శివసాయి నగర్ కాలనీ ఫేస్–1లో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ముఖ్యఅతిథిగా మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బోనాల పండుగతో కార్పొరేషన్ పరిధి కొత్త శోభ సంతరించుకుందనారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు ఈ ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లకు చెందిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

ముగిసిన కట్ట మైసమ్మ ఆలయ వార్షికోత్సవాలు



వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: బుద్వేల్ కట్ట మైసమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవాలు ఆదివారం ముగిశాయి. వార్షికోత్సవాల సందర్భంగా ఆలయంలో మూడు రోజులుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కోరని శ్యామ్ కుటుంబసభ్యులు అమ్మవారికి బోనం సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

యువకుడి ఆత్మహత్య



పరాజ్‌ఖాన్ మృతదేహం

శంషాబాద్ రూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఊట్‌పల్లిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. క్యాబ్ డ్రైవర్ మొహమ్మద్ పరాజ్‌ఖాన్(23) ఊట్‌పల్లి శివారులో నివాసముంటున్నాడు. ఇతను కొందరి నుంచి, ఆర్థిక కార్యాలయాల నుంచి అప్పు తీసుకున్నాడు. తిరిగి వీటిని చెల్లించలేకపోయాడు. ఈ క్రమంలో ఈ నెల 28న రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహంకాళి ఆలయంపై అధికారుల నిర్లక్ష్యం

గోల్కొండ: గోల్కొండ కోటలోని మహంకాళి అమ్మవారి ఆలయంపై దేవాదాయశాఖ అధికారులు నిర్లక్ష్యం చూపిస్తున్నారని గోల్కొండ పీస్ కమిటీ చైర్మన్ ఎస్.రాజువస్తాద్ అన్నారు. ఆదివారం గోల్కొండ కోటలో ఆయన దేవాదాయ శాఖ అధికారులపై తీవ్రంగా మండిపడ్డారు. జగదాంబిక అమ్మవార్లచే దేవాదాయ శాఖ అధికారులు బంగారు ఆభరణాలతో అలంకరిస్తున్నారని పక్కనే ఉన్న మహంకాళి అమ్మవారికి ఒక మాసం బంగారు ఆభరణాలు కూడా లేకపోవడంలో అధికారులు మతబలు ఏమిటని ఆయన ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏర్పాటు చేసిన ఈ బోర్డును తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దయానంద్, బి.జంగయ్య, అశోక్‌కుమార్, రాంబాబు యాదవ్, నర్సింగ్‌రావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

గౌలిపురా: గౌలిపురా ఆరె కటిక సూర్యవంశీ సంఘం ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఆరె కటిక సంఘం భవనంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. డాక్టర్ బర్మా భగీరథ్ రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆరె కటిక సంఘానికి చెందిన ఎల్‌కేజీ నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు నోట్ పుస్తకాలను, మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా భగీరథ్ రాజ్ మాట్లాడుతూ..విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగిస్తే ఆశించిన ఫలితాలను సాధించవచ్చునన్నారు. ఆరె కటిక సంఘం ప్రతినిధులు జమాల్‌పూర్ గంగాధర్, డి.గోపాల్‌తో పాటు మహవీర్ ప్రసాద్, యశ్వంత్‌రావు, రమేశ్, బాబురావు, మారుతీరావు, దశరథ్ రాజ్, రఘురాం పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై ఉక్కుపాదమేది?

- శంషాబాద్‌లో విచ్చలవిడిగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
- హైవే ఫుట్‌పాత్‌లపై కంటైనర్‌లు ఏర్పాటు చేసి దందా చేస్తున్నా చర్యలు శూన్యం
- సాతంరాయిలో యుద్ధప్రాతిపదికన డబ్బాలు తొలగించిన మున్సిపల్ అధికారులు
- పట్టణ ప్రధాన కేంద్రంలో పట్టించుకోని మున్సిపల్ అధికారులు



హైవే ఫుట్‌పాత్‌పై కంటైనర్ వేసి హోటల్ నడిపిసున్న దృశ్యం

శంషాబాద్: 15 రోజుల కిందట సాతంరాయిలోని ఓ గేటెడ్ కమ్యూనిటీకి సమీపంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న చిరువ్యాపారాలకు సంబంధించిన డబ్బాలు తొలగించాలని ఉన్నతస్థాయి నుంచి అందిన ఆదేశాలను అధికారులు క్షణాల్లో పూర్తి చేశారు. పక్కాగా పోలీసుల సహకారంతో జేసీబీలను ఏర్పాటు చేసి అక్కడున్న గరీబోళ్ల డబ్బాలను వెంటనే తొలగించి పెద్దసార్ల ఆదేశాలను ఆదేశాలను తూచాతప్పకుండా పూర్తి చేశారు. నాలాను ఆనుకుని ఆక్రమణలున్న కారణంగానే ఫిర్యాదులు అందగానే వాటిని తొలగించినట్లు మున్సిపల్ అధికారులు చెప్పుకొచ్చారు.

మరి ఇక్కడ..?

శంషాబాద్ పట్టణ ప్రధాన కేంద్రంలో ప్రజలకు తీవ్ర ఇబ్బంది కరంగా మారుతున్న ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై మున్సిపల్ అధికారులు ఏడేళ్లుగా ఒక్కటంటే ఒక్కసారి కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గతంలో అనేక మార్లు ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు కౌన్సిల్‌లో తీర్మానాలు చేసి అవి కార్యాచరణకు నోచుకున్న దాఖలు కూడా లేవు. రోడ్లను ఆక్రమించి హోటళ్లు, వ్యాపారాలు చేసుకుంటున్నా కన్నెత్తి చూసిన పాపాన పోవడం లేదు.

అద్దెకిచ్చేస్తున్నారు...

ఫుట్‌పాత్‌లను ఆక్రమించి కొందరు సొంత వ్యాపారాలను విస్తరిస్తుండగా మరికొందరు తమ దుకాణాల ముందు చిరువ్యాపారులకు అద్దెకిస్తున్నారు.



రాళ్లగూడ రహదారిలో ఫిరంగి నాలాను ఆనుకుని వేసిన డబ్బాలు



రాళ్లగూడ రహదారిలో ఫుట్‌పాత్‌లపై దందాలు

రోడ్డును అద్దెకిచ్చి ఏళ్లుగా లక్షల రూపాయలు సంపాదిస్తున్న తీరు కూడా ఇక్కడ షరామాములే అన్నట్లుగా మారింది. పట్టణంలోని రాళ్లగూడ రహదారిలో ఫిరంగి నాలాను ఆనుకుని పదుల సంఖ్యలో డబ్బాలను ఏర్పాటు చేసి అద్దెకిచ్చేస్తున్నారు. దీనిపై ఇంతవరకు మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణ కారణంగా సాధారణ ప్రజలతో పాటు ప్రయాణికులు సైతం నిత్యం నరకం చూస్తున్నారు. జనాభా రద్దీలేని సాతంరాయిలో పెద్దసార్ల ఆదేశాలతో ఆగమేఘాల మీద ఆక్రమణ తొలగింపులు చేసిన అధికారులు అదే రీతిన పట్టణంలో ఉన్న ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగిస్తాం..

పట్టణంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని ఉన్న కట్టడాలు, డబ్బాలను తప్పకుండా తొలగిస్తాం. రహదారులను ఆక్రమించి ఉంటే కఠినంగా చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలు ఎవరివైనా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– సుమన్‌రావు, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్

ఘనంగా జగన్నాథ రథయాత్ర



రాజేంద్రనగర్: ఇస్కాన్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో ఆదివారం రాత్రి జగన్నాథ రథయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పుర వీధుల గుండా స్వామి రథయాత్రను ఉప్పర్‌పల్లి నుంచి సామ భూపాల్ రెడ్డి గార్డెన్ వరకు నిర్వహించారు. గార్డెన్‌లో నిర్వహించిన పూజా కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జగన్నాథున్ని దర్శించుకున్నారు. ఈ ఊరేగింపు దారి పొడవున భక్తులు భక్తి గీతాలు ఆలపిస్తూ కోలాటాలు, నృత్యాలు ఆడుతూ ముందుకు కదిలారు. రాజేంద్రనగర్ పోలీసులు రథయాత్ర నేపథ్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

ప్రతి ఒక్కరూ పొదుపును అలవాటు చేసుకోవాలి

రాజేంద్రనగర్: పొదుపును ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మార్కండేయనగర్ కాలనీకి చెందిన శ్రీ సత్యసాయి పొదుపు సంఘం 25వ వార్షికోత్సవం శివరాంపల్లి ప్రజాభవంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..పొదుపు సంఘాలతో ప్రజలు ఎంతో వృద్ధి చెందుతున్నారన్నారు. 25 ఏళ్ల నుంచి సంఘం అభివృద్ధికి పాటుపడిన గడ్డె యాదగిరి, పగిడిమర్రి సూర్యనారాయణ, ఏర్వ సత్యనారాయణ,గడ్డె కృష్ణ, పగిడిమర్రి వాసు, కోటశ్యామ్ ఇతర పాలకవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో రమేష్ ముదిరాజ్, లక్ష్మీనారాయణ, జయప్రకాష్, వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

ఘనంగా గోరింటాకు పండుగ



గోరింటాకు పెట్టుకొని సందడి చేస్తున్న మహిళలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఘనంగా ఆషాఢ మాసం గోరింటాకు పండుగ సంబరాలు నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యాకపరమేశ్వరి ఆలయంలో మహిళా కమిటీ ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం గోరింటాకు పండగను మహిళలు ఆనందోత్సవాల నడుమ జరుపుకొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని గోరింటాకు పెట్టుకున్నారు. అనంతరం శాఖంబరి ఉత్సవంలో అమ్మవారిని అలంకరించారు. ధాన్యాధి నివాసంలోని వడ్లతో వచ్చిన బియ్యంతో మధ్యాహ్నం అన్న ప్రసాదం వితరణ చేశారు.

బోనాలను ఘనంగా నిర్వహిద్దాం

మణికొండ: ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సారి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని మణికొండ క్వార్టర్స్ ఉత్సవ కమిటీ నాయకులు తీర్మానించారు. ఆదివారం కాలనీలోని ఆలయం వద్ద నిర్వహించిన సమావేశంలో బోనాల ఉత్సవాలకు చేయాల్సిన ఏర్పాట్ల గురించి చర్చించారు. గతేడాది కంటే ఈసారి మరింత వైభవంగా బోనాలను నిర్వహిద్దామని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశవచారి, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, దివ్య జ్యోతి యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మణికొండ క్వార్టర్స్ నాయకులు

కాలనీకి సిందూర్ పేరు పెట్టడం అభినందనీయం



సింధూర్ కాలనీ ఆవిష్కరణలో కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మిగూడ వాంబేకాలనీలో నూతనంగా నిర్మించబడిన కాలనీకి సిందూర్ కాలనీగా ఆవిష్కరణ చేశారు. ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పాక్ పై భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో విజయకేతనం ఎగిరేసి దేశ ప్రజల మన్ననలు పొందిన నరేంద్రమోదీపై అభిమానంతో ఏకంగా కాలనీలోని ప్రతి ఒక్కరూ సిందూర్ పేరును ఖరారు చేసి అభిమానం చేటుకున్న వారిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అడికే జనార్దన్, సుబ్బారెడ్డి, మనీష్, తివారి, మధుసూదన్ రెడ్డి, ఓంప్రకాష్, సంపత్, రత్నాకర్, శంకర్‌రెడ్డి, మహేష్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా వారాహి దేవి నవరాత్రోత్సవాలు

రాజేంద్రనగర్: బుద్వేల్ కోట మైసమ్మ తల్లి ఆదివారం వారాహి దేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా ఉన్మత్త వారాహీ స్వరూపిణిగా దర్శనమిచ్చింది. ఆషాఢ మాసం వారాహి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు తెల్లవారుఝామున అమ్మవారికి పంచామృత అభిషేకాన్ని నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అభిషేకం అనంతరం ఉన్మత్త వారాహిగా అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన పూజా కార్యక్రమాలలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆదివారం కావడంతో రాత్రి నిర్వహించిన మహా హారతి కార్యక్రమానికి వందలాది మంది భక్తులు హాజరయ్యారు.



అలంకారమైన వారాహి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1984–85 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఉప్పర్‌పల్లి ఇంపీరియల్ బన్క్వెట్ హాల్‌లో జరిగిన ఈ సమావేశానికి నాటి విద్యార్థులు తమ కుటుంబసభ్యులతో హాజరయ్యారు. 40 ఏళ్ల అనంతరం విద్యార్థులంతా నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు అనంతరెడ్డి, కమలా, గాబ్రీయేలమ్మను ఘనంగా సన్మానించారు.

ఆకట్టుకున్న కథక్, భరతనాట్య ప్రదర్శనలు

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కథక్, భరతనాట్య ప్రదర్శనలతో అలరించారు. పూణే నుంచి వచ్చిన కథక్ కళాకారిణి నేహాదాంతే ప్రదర్శనలో గణేశా వందన, తాల్‌ధమార్, మ్యూజిక్ అంశాలను ప్రదర్శించారు. అంజు అరవింద్ శిష్యబృందం అలరిపు, పుష్పాంజలి, జతిస్వరం, అంబస్తుతి, కావడి చిందు, అర్ధనారీశ్వర అష్టకం, ముద్దుగారే యశోద, తిల్లాన తదితర అంశాలను కళాకారులు శిఖ, అద్రిత, ఆశ్రీత, మానస, సాధ్వి, కృత్వికా, నేత్ర, సమర, దియా, మైత్రి, ఎంలీన్, అమూల్య, అక్షిత ప్రదర్శించారు.





12న ఐటీ ఉద్యోగులకు అవగాహన

రాయదుర్గం: ఐటీ ఉద్యోగుల కోసం గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో జూలై 12వ తేదీన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. శాంతిసరోవర్ క్యాంపస్‌లోని ఇన్నర్‌స్పేస్‌లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. ఈ సందర్భంగా 'ఇన్నర్ ఎక్స్‌లెన్స్ రీట్రీట్' పేరిట 'ఒత్తిడి లేని జీవితాన్ని గడపడానికి మనస్సును పున:ప్రారంభించడం'పై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సమావేశంలో ముంబాయికి చెందిన అంతర్జాతీయ వక్త, కార్పొరేటర్ ట్రైనర్ బి.కె. శ్రేయ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

హెచ్‌సీయూలో 1వ తేదీ డాక్టర్స్ డే

రాయదుర్గం: 'డాక్టర్స్ డే'ను పురస్కరించుకొని గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు అసోసియేషన్ కన్వీనర్ టి రామస్వామియాదవ్ తెలిపారు. క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పాల్గొంటారని, అలాగే అపోలో ఆస్పత్రుల డిపార్ట్‌మెంట్ ఆఫ్ నెఫ్రాలజీ హెడ్ డాక్టర్ రవి ఆంద్రూస్ పాల్గొంటారని తెలిపారు.

ప్రత్యేక పూజలు



రాయదుర్గం: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని తొలి ఆదివారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రాయదుర్గం క్యామ్లేట్ వీధిలోని ఊరపోచమ్మ ఆలయంలో ఆషాఢమాసం ప్రతి ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మన్ కీ బాత్ వీక్షించిన నాయకులు



మణికొండలో ..



హైదర్‌గూడలో ..

మణికొండ: ప్రధాని మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి నిర్వహించే 123వ మన్ కీ బాత్‌ను మణికొండ బీజేపీ నాయకులు పార్టీ కార్యాలయంలో ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని ఇటీవల నిర్వహించిన యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడం, పూరీ జగన్నాథస్వామి రథోత్సవం చరిత్రలో గొప్పగా జరుగుతుందని పేర్కొన్నారని మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి అన్నారు. మన తెలంగాణలోని భద్రాచాలం మహిళలు సిరిధాన్యాలతో తయారు చేస్తున్న బిస్కెట్‌లు హైదరాబాద్ నుంచి లండన్‌కు ఎగుమతి అవ్వడం ఎంతో గొప్ప విషయమని వారిని అభినందించారన్నారు. అంతరిక్షానికి వెళ్లిన శుభాన్‌శుక్లకు అభినందనలు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీరప్ప, మధు పాల్గొన్నారు.

అత్తాపూర్: హైదర్‌గూడలో ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. డివిజన్ అధ్యక్షుడు సుల్గే వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ హాజరయ్యారు. మల్లారెడ్డి, కొమురయ్య, విజయ్, సుధాకర్, రాజశేఖర్, జి.రాజు, రాము, సతీష్, శ్రీకాంత్ చారి, కిరణ్ చారి, ప్రవీణ్, భరత్, సుధాకర్ రెడ్డి, రవి, వినోద్, హనుమంత్ రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

నల్లపోచమ్మకు వెండి బహూకరణ

గోల్కొండ: సబ్జిమండిలోని నల్లపోచమ్మకు సేవ చేయడం తన అదృష్టమని ప్రముఖ సంఘసేవకుడు టి.అరవింద్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం కార్వాన్ సబ్జిమండిలోని నల్లపోచమ్మకు 2.2 కిలోల వెండిని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ వెండితో అమ్మవారికి వెండి కవచం, కిరీటం తయారు చేయించాలని, దీనికి అయ్యే ఖర్చులు కూడా ఇస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొర్నల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కట్ట శ్రీనివాస్, కోశాధికారి డి.గోపాల్‌తో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

శ్రీరాంనగర్ కాలనీ అధ్యక్షుడిగా సూర్యనారాయణరెడ్డి



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు

మణికొండ: హోరా హోరీగా జరిగిన శ్రీరాంనగర్ (సెక్రటేరియట్) కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో కె.సూర్యనారాయణరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలో గతవారం రోజులుగా ఎన్నికల హడావిడి కొనసాగింది. అందులో భాగంగా ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం 5గంటల తరువాత లెక్కింపు చేసి, రాత్రికి ఫలితాలను వెల్లడించారు. ఆదివారం జరిగిన అధ్యక్ష స్థానానికి పోటీపడిన సూర్యనారాయణ రెడ్డికి 110 ఓట్లు, కె.శివరామిరెడ్డికి 73 ఓట్లు, వెంకటేశ్వర్‌రావుకు 29, అంబేద్కర్‌కు 2 ఓట్లు వచ్చాయి.

ఉపాధ్యక్షులు 3 స్థానాలకు ఐదు మంది పోటీ పడగా అందులో బి.శివరామకృష్ణకు 159, కె.నవీన్‌కు 139, రేగటి రవికి 116, ఎం.కుమారరత్నంకు 95, ఎ.కృష్ణారావుకు 65 ఓట్లు వచ్చాయి. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారు గెలుపొందారు. ఒక స్థానం ఉన్న కోశాధికారి పదవికి ముగ్గురు పోటీ పడగా జె.మాదవరావుకు 103, పీబీ శ్రీకాంత్‌కు 97, అనితాదేవికి 11 ఓట్లు వచ్చాయని ఎన్నికల అధికారి పీయూవీ సుబ్బారావు తెలిపారు. గెలుపొందిన నాయకులకు కాలనీవాసులు శుభాకాంక్షలు తెలిపి సన్మానాలు చేశారు.

ఏకగ్రీవం అయిన వారు వీరే..

ఎన్నికల్లో పోటీ లేకుండా ఉన్న స్థానాలకు సరిపడ మంది నామినేషన్లు వేయడంతో పలు పదవులు ఏకగ్రీవం అయ్యాయి. వారిలో గత కొన్ని పర్యాయాలుగా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఎస్.రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సతి సునితారెడ్డి, ఎ.విజయ్‌కుమార్, కల్చరల్ సెక్రటరీగా బి.రామ మనోహర్‌రావు, జాయింట్ సెక్రటరీలుగా జగన్నాథరావు, పి.సుజాతలు ఏకగ్రీవం అయినట్లు గతంలోనే ఎన్నికల అధికారి ప్రకటించారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులుగా ఆర్. ఆనందబాబు, ఎం. కృష్ణ, ఆర్. మురళీధర్, మురళీకృష్ణ, సీహెచ్. శ్రీనివాసరావు, జి. సూర్యనారాయణ, కె. విఠల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.